స్కెచ్

# వాక్శుద్ధి విజయం

యస్. లక్ష్మీనరసింహాచార్య

విజయరామయ్య మంచి వాక్శుద్ధి కలవాడని ప్రతీతి. అతనికి తెలిసిన వారిలో నూటికి నూరు పాళ్ళమందికి అతని వాక్శుద్ధిమీద నమ్మకంవుంది. దీనికి కారణము అతడు ఎప్పుడూ అబద్ధం ఆడక పోవడమే కాదు, అతడు చెప్పేమాట అక్షరాలా జరిగేది. అయితేమాత్రం అతడు జ్యోతిష్కుడు కాదు. ప్రత్యేకంగా ఆలోచించి అతను ఫలితం ఎన్నడూ చెప్పడు. మాటలసందర్భంలో మాటా పెరిగినప్పుడు, అతడు చెప్పిన మాటకు తిరుగు లేదు. అందుకు వివాదపరిష్కారానికి విజయ రామయ్యను ఆహ్వానించడంలో ఆశ్చర్యమేముంది? ఇంతా చేసి విజయరామయ్య ఏ మధ్యవయస్కుడో ఏ ముదుసలివాడోనని ఊహించకండి. అతడు పాతికేళ్ళ యువకుడు; విద్యావంతుడు. అతని నిరాడంబరవాక్కు, నిఖిలజన సౌభ్రాతృత్వము, నయవినయములు, దయాదార్ఢ్యములు అతని హృదయ పద్మ మకరంద ధారావాహికములు. కులభేదములెరుగని అతనిమనస్సు, దీనజనోద్ధరణ యెరిగిన అతని అమృత హస్తము, వాక్శుద్ధి, ప్రశస్త తర కీర్తి సంపాదకములు.

విజయరామయ్య మిత్రుల్లో ఒకడైన రామాను జానికి విజయరామయ్య వాక్శుద్ధిమీద నమ్మకం లేదు. అతని వాక్శుద్ధిగురించి రామానుజంముందు ప్రసంగించినా, అతడు గొప్ప దేవీ ఉపవాసకుడు అని చెప్పినా, రామానుజం వాళ్ళనందరనూ యీస డించేవాడు. 'అంతా హరిశ్చంద్రులేలే' అని హేళన చేసేవాడు.

తల్లి చచ్చిపోయిన కారణంగా రామానుజం గుండుగీయించి, మీసం గొరిగించి తలకు మఫ్లర్ చుట్టుకొని, విజయరామయ్యా శంకరం మాట్లాడు తున్న ప్రదేశానికి వచ్చాడు. శంకరం, రామాను జానికీ, విజయరామయ్యకూ స్నేహితుడే! రామా నుజు వస్తూనే తలకుచుట్టిన మఫ్లర్ ఊడదీసి గుండు సరిజేసుకుంటుంటే,—శంకరం ఫక్కున నవ్వేడు. రామానుజానికి యిది 'ఇన్సల్టు' అనిపిం చింది. అప్పటి కప్పుడే మిత్రబృందం చూట్టూ చేరింది. దాదాపు పదిహేనుమందివరకూ వుంటారు యీ ముగ్గుర్ని కలుపుకొని.

అంతమందిలో తనగుండుచూచి శంకరం నవ్వి నందుకు రామానుజం తీవ్రంగా బాధపడి, కోపాన్ని జీర్ణించుకొని, తాత్కాలికంగానైనా ఆత్మ నిగ్రహం చేసుకొనే వ్యక్తికాదు గనుక టక్కీమని "నీకూ,——ఈనాడు కాకపోతే మరొక నాడైనా యీకర్మ పడుతుందిలే!" అన్నాడు ఏడుపు ముఖంతో. దీనితో శంకరానికి కోపం వచ్చింది. "బ్రతికున్నవాళ్ళను వేగంగా చంపేయ మన్నావేమిటి?" అన్నాడు.

"నీకు ఈనాడు కాకపోతే మరొకనాడైనా యీ కర్మ పడుతుందిలే! అన్నావుకదా, ఆకర్మ అతనికి తప్పకపోతే?" అడిగాడు విజయరామయ్య. "పట్టకపోవడం ఏమిటి నీబొంద? వాడికి తల్లిలేదను కున్నావేమిటి?" దురుసుగా అడిగాడు రామానుజం. మిగతా వాళ్ళు గ్రుడ్లప్పగించి చూస్తున్నారు. "ఇతనికి నీలాగ గుండుచేసుకొనే కర్మలేదు" అన్నాడు విజయరామయ్య. రామానుజానికి ఒళ్ళు మండి, "నువ్వు గొప్ప కలియుగ సత్యహరిశ్చంద్రు డవు కావచ్చు. కాని నాముందు నువ్వు అబద్ధం ఆడుతుంటే నిన్ను అంతా సత్యహరిశ్చంద్రుడని వెనక వేసుకొస్తారేం?" అని విజయరామయ్య మీదవుండే దుఃఖాన్ని వెళ్ళబోశాడు.

"నేను ఏవిషయంలో అబద్ధం ఆడాను శంకరం? నీలాగ కర్మచేసుకోవలసిన వాడుకాదు" అన్నాడు విజయరామయ్య కట్టెవిరచివట్లు. "చూడండోయి బ్రదర్సు! మీరు వీడ్ని ఒక సత్యహరిశ్చంద్రుని క్రింద జమకట్టి పారేశారు యిప్పుడేమంటారు? మీముందేగా వీడు అబద్ధం పలుకుతున్నది!"

మిత్రబృందం అంతా ఒక్కసారి స్తంభించింది. విజయరామయ్య ముఖాన్ని పరిశీలనగా చూడ్డం ప్రారంభించారు. కాని వాళ్ళలో రామారావు మాత్రం ఊరుకోలేదు.

"ఒరేయ్ రామానుజం! అయితే విజయరామయ్య అబద్ధం పలికేడంటావా?" అని అడిగేడు నిలదీసినట్లు.

"అహఁ, ముమ్మాటికీ" అన్నాడు రామానుజం.

"ఒక్కమాట విను, నువ్వు శంకరానికి కర్మ చేసుకోవలసిన అవుసరం ఎప్పటికైనా వుందంటావ్. దీనికి విజయరామయ్య కాదంటాడు. ఇందులో అతని అబద్ధం యేముంది? అదేదో తెలుసుకోని అప్పుడు అతనిమీద నిందవెయ్యాలిగాని" అని విజయరామయ్య మాటను సమర్థించాడు రామారావు. రామారావు చెప్పినమాట మీదట అందరకూ విజయరామయ్య మాటమీద నమ్మకం కల్గింది.

"సరిసరే, అదేదో నేనూ చూస్తాను వీడి వాక్శుద్ధి" అని రామానుజం సిగరెట్టు నిప్పంటించాడు. ఆనాటికి మిత్రులసభ ముగిసింది.

కాలచక్రంలో కొన్ని మాసాలు గతించిపోయాయి. విజయరామయ్య వాక్శుద్ధి గురించి పేరు కొంత అభివృద్ధిచెందింది. కాని, రామానుజానికి మాత్రం, విజయరామయ్య వాక్శుద్ధి విషయంలో నమ్మకంలేదు. పైగా విజయరామయ్య వాక్శుద్ధిగురించి మాటలువస్తే, ఆనాడు శంకరం విషయంలో విజయరామయ్యచేసిన వాగ్దానాన్ని జ్ఞాపకానికి తెచ్చి, అతనిని అవమానింప చూచేవాడు రామానుజం.

శంకరం వరుసగా యిప్పుడు వారంరోజుల నుండి మిత్రబృంద సమావేశానికి హాజరుకావడం లేదు. కారణం భోగట్టాచేయగా, అతనికి జ్వరమని తేలింది. శంకరం మిత్ర సమావేశానికి రావడం మానివేసినదగ్గరనుండి, రామానుజం, విజయరామయ్యను "శంకరానికి కర్మపట్టదులే" అని అవమానించని రోజు లేదు.

అనుకోకుండా రోజూ రామానుజం చేస్తున్న హేళనకు విజయరామయ్య ఫక్కున విజయసూచకంగా నవ్వేడు. దీనికి తగినట్లుగానే శంకరం ఆ రోజే చనిపోయాడు.

రామానుజానికి యీ సంగతి తెలియదు. మామూలు పాట పాడుతూ, విజయరామయ్యను చూచి, "శంకరానికి కర్మ పట్టదులే" అన్నాడు. అక్కడేవున్న రామారావు, "నిజంరా, పాపం శంకరం యీరోజు ఉదయమే చచ్చిపోయాడు: నీ శ్రాద్ధం ఇంక వాడు వాళ్ళ తల్లికేం కర్మచేస్తాడు?—ఆవిడ కంటె వీడే ముందు చచ్చిపోతే..."

"ఆఁ ఆఁ" కళ్ళు మిటకరించాడు రామానుజం. "ఇప్పటికైనా తెలుసుకో — విజయరామయ్య వాక్శుద్ధి పూర్వజన్మ సుకృతం" "భాయీ, ఇదిగో నా శతకోటి నమస్కారాలు! నీకూ — నీ వాక్శుద్ధికీ" అన్నాడు—రామానుజం విజయరామయ్య నుద్దేశించి. ★

---

(34-వ పేజీ తరువాయి)

పశ్చిమదేశాలకు తప్పించుకుపోయినవారిలో ఏ కొద్దిమందో తప్ప తక్కినవారందరూ 18–20 సంవత్సరాలలోపు వయసువారే.

"స్వతంత్రదేశాలకు చేకూరిన ఈ ఘన విజయం కారణంగా బేటరీ ఓడ విషయంలోను, కమ్యూనిస్టు పోలెండులోను తీవ్రపరిణామాలు ఏర్పడ్డాయి. ఓడలోనుంచి ఎవరు ఎప్పుడు పారిపోవచ్చునో కమ్యూనిస్టు అధికారులు ఊహించడానికి వీలు కాకుండా పోయింది. ఈ దిగులుతో వారు చేయగలిగిందల్లా, ఓడలో నావికులుగా పనిచేస్తున్న వారిలో కొందరిని ఏరివేయడమే. కాని ఇలా ఏరివేత కార్యక్రమాల నమలు జరపడంవల్ల ప్రయోజనం ఏమీ లేకుండాపోయింది. ఎందువల్లనంటే కొత్తగా నియమించబడినవారుకూడా పారిపోవడం ప్రారంభించారు."

అవకాశముంటే ఇంకా చాలామంది పోలెండు నుంచి తప్పించుకు వస్తారని స్విక్లిన్‌స్కీ విశ్వసిస్తున్నాడు. పోలిష్ ప్రజల స్వాతంత్ర్య కాంక్షను కమ్యూనిజం ఎన్నటికీ అణచివేయలేదని స్విక్లిన్‌స్కీ నమ్ముతున్నాడు. ఇతర నియంతృత్వాలన్నిటిలాగనే కమ్యూనిస్టుపరిపాలనకూడా మనజాలదని స్విక్లిన్‌స్కీ వ్రాశాడు.